# శివరేత్రి సంబరం

"అయితే అన్నకు బువ్వొత్త కెల్ల వేందిరా కొండయ్యా?" అని యిసుగుతో అరిసింది కొండయ్య అమ్మ యీస్పరమ్మ.

'.........'

'నూ పలకవేందిరా గానిగెద్దుకుమల్లే? గొంతు గుంజకబోతుందది కాత్తె మాటిన్రా కొండయ్య సచ్చినోడా?'

'నన్ను కొండకు పంపిత్తానంటే?' మాట సల్లగా రానిచ్చాడు కొండయ్య, శివరేత్రి దెగ్గిర కొచ్చుంటాన.

'ఆడే పడిసావు—కొండేందీ, కొండేందిరా మాయిదారి పచ్చి?'

'నే పాను!'

'యాడికిరా నూ పోందీ?'

'నే బువ్వొత్తికెల్లనే!'

'పొత్కు రాల్దన్నా, ఎదవసచ్చినోడా! ఎత్తికెల్లకుంటే యియ్యాల్నీ కేపుండా వుందయి!'

'నన్ను కొండకు పంపిత్తానంటే!'

'కొండేందిరా నీ మొదులారా?'

'కోటయకొండకే!'

'కోటయకొండకీ! ఈడి కేం బుట్టిందమ్మా!'

'నే పావల్చిందే! సూరాయాళ్లంతా ఎల్దం లేదమ్మా?'

'ఆ సూరాయిగాడంట్రా—ఆ కబోది పచ్చంట్రా సీకెటుసేరీ—ఆటనే ఎల్దువులేగానీ, ముంగల బువ్వొత్తుకెల్లూ, అయ్య కేకలేత్తాడూ!'

'అయితే పంపిత్తానంటావా?'

'ఈ ముద్దేందమ్మా నాకూ ఓ సెంప కూడెత్తి కెల్లాల్చిన పనుంటేనూ- మొదులు నూ లోనికి పా, నీ కతేందో ఆయి న్దేలుత్తాడూ—'

'ఓ అయ్యోవ్, సూడే పడ్తోత్తుందదీ—' అంటా యిదిలిచ్చుక, లోన ఒల్లు చరిలేక పొండుకునుండ కోటయ్యకాడికి లగెత్తుకెల్లాడు కొండయ్య.

కోటయ్య కిట్టకాలవలో బల్లకట్టు నడుపుతాడు. పెల్లాం, యిద్దరు పెరిగొత్తుండ పిల్లకాయలతో కాపరం కాత్తె సుమారుగా చరిసూసుకుంటా పోతావుంటాడు కోటయ్య. మడిసి గెడ్డపారకుమల్లే సిసలయిన గెట్టిమీన బోతావుండా, కాల్దోసం

సెట్టంలో రెన్నాల్నించీ కాయలాన బడ్డాడు రతంలాంటి కోటయ్య కాత్తా.

'అబ్బ, ఏందిరా జాతర సేత్తుండావు కొండయ్యా? దా, యిటొచ్చీడ కూకో.' అంటా కొండయ్యను దెగ్గిరికి లాక్కుండాడు, మంచంలో ఒనుకుతా పడుండ కోటయ్య.

'ఏందయ్యా యీడ్తో పెలయంగా వుంది దినవూఁ! ఆడకూకో ఎట్టుకుంటే ఎట్ట గుదురుద్దీ? నూ లేసిరావేందిరా, అన్నకు బువ్వెత్తుకెల్దువూ?' అంటా తనూ లోనకొచ్చి సేతు లాడిచ్చిందీ ఈస్వెరమ్మ.

'ఏందే ఆణ్ణి గాబరా బెడ్తావూ? కాత్తె అన్నకు బువ్వెత్తికెల్లరా అంటే ఎత్తికెల్లడంటే?'

'ముంగల యీణ్ణి కోటయకొండకు పంపియిట వేందో యిశారియవేందీ? ఏందోనయ్యా పానాలు శాదేసి తోడ్తుండాడూ!'

'సూడయ్యా ఎట్ట సెప్పద్దో! పంపియ్యాలంటే మాయ్య పంపి డను కుండావా? ఏంయ్యా?'

'వూఁ, పొయ్యావులే పొలుపు దీసుక బాదే ఓళ్ళు—'

'సూడయ్యా!'

'నువ్వుండే మెదులూ—ఇప్పట్నుంచీ కొండలేందిరా కొండయ్యా?'

'ఏంయ్యా, అల్లంతా పోతం లేదయ్యా కోటయకొండకూ—సూరాయ్, బూసాయ్, ఈరాయ్—మరి—మరామైన—కోడూరిపెబ ఎల్తావుంటే—'

'ఆఁ ఈపిస్కెపిట్ట ఎంటుండాలె గావల్ను మొల్లో గెజ్జలాడిచ్చుకుంటా.'

'సూడయ్యా!'

'నువ్వేందే మద్దెనా—వూఁ—నే దేలుత్తాగా.'

'నాకేవిటికిలే!' అనింది ఈస్వెరమ్మ యవారం సప్పన గేహిత్తా.

'పోవద్దంటే అయ్యా?'

'అటనే పోదువులే. యిప్పుడాల్నుంచి గడబిడ ఏవిఁటిగానీ—'

'కాదయ్యా, ఎల్లుండిమద్దాన్నం కాణ్ణుంచి కోడూరిపెబ ఒచ్చుద్దంటా-'

'అటనే పంపిత్తే చరిగా! ఆడికి బూకట్టిచ్చి పంపీక అట్ట నిలబడి సూత్తా వేందే? నూ అణ్ణెం అనమాకూ, ఆ డసలు మంచోడుగాదూ! కాత్తె దబ్బున బొయిరాయ్యా పొద్దుబోతుండదీ!'

'యీవజాన దొడుమీ నెత్తికెల్లనూ—అయ్యా! యియ్యాల అన్నతో ఆడే పొండుకోనంటే? అన్న రామన్నాడే ఆయ్యా.'

'ఆడ నూ దేనికిరా తగలాటానిగ్గాకుంటే? ఒద్దులేయ్యా, యింకోపా

లెల్దువు గానీ !'

'బత్తమాశగుంటదే ఆడ, అయ్యెయ్యో మాట్టాడుకుంటా పొండుకుంటే !'

'దబ్బున పారా ఎట్టనోగట్టా ! సిలిపేసాలు సెయిక కాత్తాడా బ్రదం ! అన్నను కనిబెట్టి సూడమ్రనోయ్'

'ఎల్లుండి మద్దాన్నం పంపియ్యాలయ్యోవ్–'

*　　　*　　　*

నెత్తిన బువమూటా, సేతిలో ఎదురుకర్రా, మొల్లో గజ్జలాడించుకుంటా, కాలవగెట్టు మైలు పైసిల్కు పయానానికి వుసారుగా పదాలొదులుకుంటా, కూత్తె లెక్క కొండ య్యెచ్చేతలికి, పొరిగింట ఆదిలచ్చి బుంగ సంకనెట్టుక, పూరెలపల బాయికాడికి నీల కొత్తా కొండయకు జతబడ్డది, కొప్పు నిగిడిచ్చుకుంటా.

'హు ! యాడికి బయిలెల్లినా పొద్దెదురేం దఁటా !' అని కాత్తె గెట్టిగా అనుకుండాడు కొండయ్య, కాలుసాగిత్తా.

'మసగసూపులోళ్ళకు మరింకెట్టుంటదీ !' మరి కాత్తె ఉసురుగా అనుకుండది ఆదిలచ్చి, కొండయ్యెంటనే నీలకుబోతా.

'పిస్కెపిట్ట పుఁయ్ పుఁయ్ !'

'సాల్లే సంబడం ! ఎఁదుకయ్యా అట నోరు జారుద్దీ ?'

'పొద్దుటాల నన్నెక్కిరిత్తివే ?'

'ఎప్పుడయ్యా ?'

'ఎప్పుడా ! బజన్నెక్కల్తో మా దూణ్ణాడిత్తుంటే, దడికాణ్ణుంచి ఎక్కిరీలా ?'

'ఆట్నికూడా ఎంట-తెచ్చుకోబొయ్యా ?'

'ఆఁ, నీకు పెల్లి సెయ్యాలనీ !'

'ఆడే వొచ్చుద్దీ—పెల్లిమాఁ డెత్తావంటే !'

'నే కోటయకొండ కెల్తున్నాగా !'

'............'

'మాయ్య నన్ను సూరా యాళ్లతో కొండకు పంపిత్తాన్నాడుగా !'

'ఒట్టిదేలే !'

'వుప్పుడే గదమ్మా నే ఆడిగొత్తుండది.'

'నిజవఁటా ?'

'ఎల్లి మాయ్యనడుగూ ! కాదంటే అప్పు డనాల్చిందే !'

'ఎందుకయ్యా కొండకూ ?'

'నే బోతాగా !'

'ఈడ బాగుండకయ్యా ఆడకుబొయ్యేది? మనూర్లో రతం కడ్తారంటా, బాం డాయిత్తారంటా, రంకుల్రాటాం ఒచ్చిద్దంటా. చుబ్బయ్య అవ్వాయి సువ్వాయి ల్దెచ్చాడంట్రా---'

'యిట్టాటియి కొండకాడ లచ్చలుంటయి లేయే! గెన గెన గెంటలాడ్తా రంగు రంగు పెబలూ, గులాందుమ్ము ల్లెగుపుతా ఎట్టాటి మనగా డెద్దు లొత్త య్యనుకుంటా---'

'ఆడ జనం తొక్కిళ్ళబడ్తా ఓరి మీనోరు పడ్తావుంటే పిల్లోళ్ళు సత్తారంట్రా, మా పిన్నావం సెప్పిందీ!'

'యియ్యన్నీ నాకు తెల్చులేయే! ఈకొండయసుటా ఎల్లిందంటే ఆడోజనం వాగుతారంటే?'

'ఒద్దులేరా యీడ మావాగుంటదీ! మరే, నా కొత్తరెయికా, కొత్తకోకా మాఅమ్మ ఏసుకోమందిగా.'

'అర అరా అంటంటే కోటయసావిం దిగిరాల్చిందే!'

'యిగమీన ఎక్కిరియనుగా'

'అరఅరా, లెగిసిపోతావుంటే—'

'పానీలేరా–నే ఎల్తుండా—'

'ఎల్లాల్చిందే, అరఅరా—'

* * *

పదమ్మీన పదం దులుపుతా, అడుగడుక్కూ ఎగి రెగుర్తా, మొల్లో గెజ్జలు గెల్ గెల్ మంటా, నిమట్లమీన మైల్లెక్కా పయానం జేసి, వుసారుగా కాలవగట్టె క్కాడు కొండయ్య. సీకటి కమ్ముకుండది. తల తల నచ్చిర్రతా ల్నాడిచ్చుకుంటా రయిం రయింన లగుడోల్తుండది కిట్ట కాలవ, కెరటాల్ని యెడాపెడా యిసుర్తా.

'ఓ అన్నోవ్?' అని కేకేశాడు కొండయ్య.

'ఓ అన్నోవ్?' అనరిశాడు కొండయ్య, బల్లకట్టు మీనోరూ లేకుంటే.

'ఓరి రారా కొండయ్యోవ్!'

'చివయ్యన్నా? యాడ్రా నువూ?'

'ఈమర్రి సెట్టుడల మీ నోవ్.'

'ఆం ఏందిరా? ఆడేం జేత్తుండావురా–వూగుతుండావంట్రా? ఆమబ్బుల్లో!' అంటా సెట్టు కాత్తైడంగొచ్చి నిలబడ్డాడు కొండయ్య, మూట దింపుక యింతగా సూత్తా.

'ఓ ఏడు కొండలా ఎంకట సావాం

నీకు నాకూ జోడు అయితే
నల్లగొండా అడ్డమయితే
నీలి మొబ్బు నీలు గార్చెరా.
ఓ ఎత్తుకొండలా చుందర నా సామా
నీలిమొబ్బు నీలు గార్చెరా.

'–హుశాయ్, హోయ్, దూకుతుండా సూస్కో–, సూస్కో–'

'చివయ్యానోవ్–దడిపిమాకురా సత్తుండాను! అమ్మబాబో! ఆ దిప్పదంటా వూగేది? ఆ దేం వుంటయ్యో తెల్దా–'

'ఎహె హె హె హె హే–'

'అట నవ్వమాకరా పీసు పీసు మం టందదీ–'

'కోటయ్యనోవ్–ఓ బల్లకట్టుకోటయ్యనోవ్? బల్లనిట్టానియ్యయ్యా, దబ్బున దాటాల, పొద్దుబోయిందీ!' అనోమడిసి కంఠం, అవకాడ గెట్టు మీన్నుంచి కేకేసింది, సెట్టుదుబ్బుల్లో అసలిగ్రహం అగుపిక్కుండా.

'ఓ రామడ్డీ? ఒత్తుండా ఒత్తుండా నిలబడూ-దార కొండియ్యోవ్.' అంటా బల్లకట్టుగొలు సిప్పి తణామంటా బల్లమీనేసి, ఆతలేపుకు బల్లకట్టునొడిలాడు శివయ్య, గెడ సలీసుగా ఏత్తా.

'ఆ కేకేసిం దెవురో!' అనుకుండాడు కొండయ్య, ఎక్కి బల్లకట్టు బద్దెల్ని గెట్టిగా పొట్టుకుంటా.

'ఏవూ రన్నోవ్? యిద్దు రుండట్టుండే-ముగ్గురే!' అని యిశారించాడు శివయ్య, బల్లకట్టు దరికి సేరుత్తా.

'మాది మాలపిల్లిలే–ఎక్కవేందే, ఎక్కరా చుబ్బియ్యా-ఆం యిగ పోనీ బాబూ. నూ కోటయ కొడుకు వెట్టా? ఆ రెవుటూ, ఆకూకునుండీ?'

'నాతమ్ముడు కొండయగాదూ! రెన్నాల్నుంచీ అయ్య లెగవక బోతేనూ–'

'ఎట్టెట్టా! పిల్లలు మంచోరే! మీఅయ్య మంచోడు గదూ? కాత్తె అయిన మాట్నిలబెట్టండి బాబూ! నే పువాకు అమ్ముకుండే దినాల్లో మామాట మంచుండే దిలే మాయిద్దరికీ! రాత్రి కీడే పొండుకుంటా రెట్టా? ఈడ పాకా వుండదిగా మరింకేం! పిల్లలు సీకట్లో బదమయ్యోవ్! సన్నాసెదవ లాల్లీళ్ల సేరి రేత్తుర్లు తుమ్మలుగొట్టి బల్లమీ నేసుకుపోతా వుంటారు, కాత్తె సూసుకోండి! బయిమెట్టి గానీ, మీ అయ్యంటే ఎట నయినా ఆడలుగాదూ! అదెప్పుడో ఓపాలి. ఈడ ఆపాలెం రాతారి బోటు, బొహు బిరుగా బర్తీఅయి, బోటేమో బోర్లబడి, ఆ ఎక్కిన ఒంద దెగ్గిరదెగ్గిర జనంలో, కొంతమంది ఈత్తా, మరి కొంతమందేమో

బుటకలేత్తావుంటే—రేత్రి అంత దైర్నం ఎవ్వురి కుంటదయ్యా? ఆమీన మీఅయ్య గాదూ యీదుకుంటా పదిపన్నెండుగుర ఒడ్డుకు లాగిందీ, పొయినాళ్లు పోంగా! పొర్దలిటుంటే బల్లకట్టెటు బోదాడికీ! ఆ ఆవులిత్తా సచ్చిం జనం, ఆ యిసయం తలుసుకుంటేనే గుండె బేజారవుద్ది!— దిగండి దిగండి—దిగవేందే యీరాం—పొద్దు బోయింది. ఎల్లొత్తాం బాబూ—బద్రవయ్యా—' అంటా మడిసీమడుసులు యెవరు బలానా రయిందీ తెలవక తలికే సీకట్లో మల్లీ గెట్టుమీన సెట్లల్లోబడి, ఒచ్చిన యిగ్రహాలు ఒచ్చినట్టుగా ఎటువటు జారుకుండ్రై, తపతపమనుకుంటా.

'నాకు తెలవదే!' అనుకుండాడు కొండయ్య బద్దెల కట్టనే కరుసుకుంటా.

'దిగవేందిర కొండయ్యా?' అన్నాడు శివయ్య, బల్లకట్టు కట్టేత్తా.

'జనం ఆవజాన సేత్తే బొహు పెవాదవే!' ఇసయం తూకం గుంటంలో కొండయను మైకం కమ్మింది.

'ఓరి కొండయ్యోవ్? ఇయ్యాల నూ బల్లదిగవేందిరా ఆకలై సత్తంటేనూ?'

'అది మునిగింది నిజవేనంట్రా?' బల్లకట్టు దిగాడు కొండయ్య, ఈరం గంలో దుష్టిబెటిసి నోడికిమల్లే.

'వారి పానీరా, ఎవురో సోంబేరెద పన్నాడంటా! బువ మూటేడ బెట్టా—యీడుందిగానీ, అమ్మయ్యా లేం జేసిందిరా బూలోకీ—నూదిన్నా వంట్రా కొండయ్యా? ఓ ర్దావేరా, కడుపుగాలి సత్తుంటేనూ!'

'ఈడ సీకటి యిట్టుండదేరన్నా?'

'ఓ ర్నువుండ్రా ఆడా—గోగాకు యిగురంట్రా—వుచ్ వుచ్—కంజా, రెల్లా, ముల్లా—వాస్దినె—యీడ సాంబారాక్కారం వుండదరయ్యో కుయ్యోడా—రారా రారా, ఈడ కూకోరా—యీదు త్తలో దేందిరా?'

'పెరుగుబువ కట్టిందిరా.'

'అ చ్చరేగానీ, పువాకు దెచ్చావంట్రా?'

'అమ్మ సంపుద్దనీ—'

'ఓ ర్సన్నా సెదవా! అందుగ్గాదంట్రా నిన్నంపలా టాడిచ్చేదీ?'

'అది గాదురా, తెలుత్తే సంపుద్దని రొండే ఏసుకొచ్చారా.'

'మరి నానుత్తావేందిరా బుల్లోడా, మాట జార్నీకుండా! అవితే అయ్య నిన్నీడ పొండుకో మన్నాడంట్రా?'

'అటనే పొండుకోమన్నాడు గాని—మనయ్య బొహు మంచోడు గదంట్రా చివయ్యన్నా? మరే—ముంగలే—నన్ను కొండకు పంపిత్తాన్నాడుగా అయ్యా!'

'కొండేందిరా—కోటయ కొండంట్రా?'

'యీరాయ్, సూరాయ్, బూసాయ్, నేనూ-మరేవోఁ—'

'వారి సాల్లేరా యిరగబోడి సేవోళ్ళు లేకా! ఏఁదమ్మా నుం ఎల్లి పగల్దీసేదాడా?'

'నీ కేవయ్యా మేం బోతే? అయ్య్య పంపిత్తాన్లా!'

'వారి పోరా, యీడ గెడెవు రేత్తా కూకుంటారూ!'

'మరి, అయ్య్య సెప్పలేదయ్యా నిన్నీడ బల్ల నడపమనీ?'

'ఎంత సెడ్డా పద్దాకదే పనెట్టా!'

'అఁ, అయ్యకు దెలుత్తేనా!'

'వారి పోరా నీ కొల్లు మా బల్సిందీ! నాకు మటు కుండదెట్టా?'

'నీ ముల్లుగర్ర నా కిత్తావంట్రా?'

'నువేందిరా గోవాఁరికి మల్లే పొట్టుకుంటా! ఆల్చిచ్చాల్చిందే-ఏడీ, ముంగలా పువాకిటిచ్చి-బూడింట పఁయిందా-నీల్దాగుదాం దా!'

'యీడ గోంగ్రడకప్ప లుండపగఁదా-మరి ముల్లుగర్రీవంట్రన్నా?'

'తాల్రా నువ్వా, యిదేఁదో తిరుగుడు గుంటేనూ! అయితే బూసాయి నిజం గొత్తాడంట్రా? బల్ కుశాల గుంటదే! యీడీ తెద్దేఁదంటా యపదానం మిగిలి పాతుంటే! కాత్తె పాకలో సాపుంని యిట దీసక రారా, యీడ కూసేపు కూకుందాం'

'యాడా ఎల్తుర్లేంది ఎట్టయ్యా-'

'కంచమెడు యీడుత్తావంట్రా? ఏందో యీన కొండకెల్తాడంటా-' అంటా కాత్తె ఎడంగా వుండ పాకలో కెల్లి ఆపీడ సీకట్లో దేవులాడి చాప బయటి కీడ్చుకుఁడాడు శివయ్య, ఎలికా బొలికా కాత్తె లెక్క ఎంట బత్తావుంటే.

'దారా కొండయ్యా, యీడ కూకుఁదాం. ఏది పువాకూ-నుప్పెట్టి దెచ్చావంట్రా?'

'చల్లె నయం, సీకాడ కేదెట్టా? యియ్యా లెట్టా గబ్బా?'

'యింద, కూత్తె నోట్లో ఏసుకో-ఎవురన్నా ఒత్తావుంటారుగా.'

'ఏఁ వొత్తారో! యీడ యింత సీకటి గుండడేం దబ్బా! యీ మర్రి సెట్టు మా మీనమీన కొచ్చుద్దేం! అయ్య్య యీడ ఒంటిగా ఎట్టుంటాడబ్బా-అయితే ఆడెవుడో యిందా కనిపోయింది వుట్టిదే నంట్రా?'

'ఎవుడాడూ? ఆళ్ళా, మాలపిల్లి సంచూ! ఏందో కూశాళ్ళే, పానీరా.'

'మొదు లీడ జనం మునిగింది నిజవేఁనంట్రా?'

'ఆ యవారం నే నోపాలి యిన్నాలే! ఎట నంటావా? పిల్లా జల్లా,

ఆడోరూ, ఓ నల్లబై పైసిల్కు ఆవులించి పానా లొచిలారంట! ఆల్లళ్ళొ కాత్తె యీత దెలిసుండ మొగోళ్ళు సందట్లో సల్లగా యీ ఆడోళ్ళ మెళ్లోవి అందిన కాడికి గుంజక పొయ్యారంట! మా పెద్ద జాతర్లేరా, యింటుంటే ఎటనో బోయింది పానం!'

'మరి మడుసు లావజాన సత్తే దెయ్యాలై ఆడే తిరుగతా వుంటారంట నిజ వేనంట్రా!'

'యియ్యన్నీ సన్నాసిమాటల్లేరా! అయితే మటుకూ, యీమద్దెనే ఓ తమాశ జరిగిందంట కొండయ్యా! ఓపానముండ మడిసేనంటా, రేత్రి నడిగెడ్డ బొపలు తొందరపనిమీన యీ గెట్టునే పోతావుండాడంటా! కాత్తె బాగా పొద్దుబోయిందం టలే ఆమడి సావజాన దొబుదొబ్బున పోతావుంటే-'యిహి హి హిహిహీ-'అంటా గిలగిల ఎన కెవురో యికిలిచ్చిన ట్టయిందంట-మరా మడిసి ఏ వాళ్లోసిత్తా పోతా వుండాడో-సెట్టుమీద గువ్వలు కావాలనుకుంటా కాత్తె లెక్క పొయ్యేతలికీ-'బో టెక్కుతా వంటయ్యా' అనెవురో సెవుకాడ పుసపుస మన్నట్టయ్యా-అట్ట కాత్తె ఎనక్కి తిరిగి సూశాడంటా, బోటేవైనా ఎనికిడ్తె ఒత్తుంద దేవోని-ఆ దెవ్వరూ లేరు! యీయవారం ఎట్టాటి దైండీ గబాల్న మడిసికి తగిలేతలికీ-ఆవజాన నీలు గారి పొయ్యేడంటే నమ్మాల్సిందే-ఎంటనే కాలవలో ఏందో పెల పెలమందంట-'ఓయ్యో ఓమ్మో' అ నరుపులంట-!'

'ఓ అన్నోవ్-చివయ్యకోన్నవ్-' ఒనుకుతా శివయ్యను గబాల్న వాటేసు కుండాడు కొండయ్య.

'ఏందిరా-ఏందిరా కొండయ్యా-'

'ఆ ఎల్తు రేందిరా-'

'యాడ్రా?'

'ఆతలగెట్టు-సెట్టదెగ్గిర-దెయ్యం-కొరివిదెయ్యం-'

'తన్నంట్రా ఎదవనూ-ఆ డేం లేందే?'

'అదేంరా-అదిగో-ఏందో-కదులాడ్తు పడి-ఆడ్తుందవి!'

'యాడ్రా-ఎవురామడ్సీ? ఓరామడ్సులూ?' అ నరికాడు శివయ్య.

'మాది తుమ్మలగుంట, సింతపల్లి పోతుండాం లేవయ్యోవ్! బల్లకట్టు మడిసి వెట్టా?' అంటా సిన్నలాందా రాడిచ్చుకుంటా దచ్చినంగా ఎల్తుండా రెవరో మడుసులు, అటు దిగువ తుమ్మలగుంటనుంచి కాలవగెట్టుమీద బాటకొత్తా.

'ఆఁ మేవేలే, ఏవూ రెల్తుండారనీ-వూరకనేలే.'

'ఆళ్ళు మడుసులే నంట్రా!'

'తొక్కంద్రా ఎదవనూ! పానం బోతే అడలు బుట్టీ! యిట్ట సెవటట కారుద్దేరా నీ ఒల్లూ-ఓ రదురుపచ్చి!' అనో సరుపు సరిచాడు శివయ్య, కొండయ్య యీపుమీన బలంగా.

'అయ్యో సత్తిన్నా చివయ్యా! యిందుకేనయ్యా తోడు వొండుకోను రామంది? ఇంకిరేత్రి కీడుంటే పానం ఆవులియదంటా! నే ఇంటికి వోతా!'

'మె డిరుగుద్ది!......ఏందో కొండకు బోతాడం టీ మొగోడు!'

'వూ( ఎల్ల కీడ కూకుంటూరు! అయ్య పంపిత్తాన్లా? నా బజన్నెక్క లేద బెట్టానబ్బా-ఏందన్నా అడేఁదో యినిపిత్తుందదీ-ఏందో అరుత్తుం డెర బావో'

'ఓహో(-ఓహో(- ఓహో(బిహీ-ఒహో ఓహో(బిహీ-' అంటూ దూరాన యినొచ్చింది ఏందో బజనకు మల్లే.

'సంపుతా ఎదవా అరిశావంటే-యాడ్డోమీనాకు మల్లే వుండదే-'

'వు(ఒహో(-వు(ఒహో-ఒహో(బిహీ ఒహో(-హోల్బాయ్-ఎఏ(, అ( ఎఏ(-'

'వుప్పుడంట్టా యాడన్నా మీనా లొచ్చేదీ! నాకు దెల్చలేరా, అయి మీనాలు మోసుకొత్తయ్యంటా! వామ్మో, ఓయ్యో-నేబలకన్నా చివయ్యానోవ్'

'ఎహె గెట్టిగా అరవమాకా! త్యాలా ఎవురో మీనా ఎక్కాల్లుంటట్టుందీ-ఒరె యాడవకురా కొండయనాయనా!-వుప్పుడు నే నేంచెయ్యాలబ్బా-ఒల్లిట్ట దిగజారు ద్దేందీ-వున్నానికి అయి కాదు గ(డా-కొండయ్యా? ఒరేయ్-యాడికిరా ఎల్తుం డావూ-ఓరి కొండాయ్యోవ్-ఆడ నిలబడా ఒత్తుండానూ-లగెయిమాకురా-'

'వామ్మో ఒత్తుండయిరో-' గెట్టుదిగి డొంకనబడి ఒల్లు తెలవకండా లగె త్తుండాడు కొండయ్య.

'ఒహో(బిహీ, హో( ఒహో(బిహీ-హోల్బాయ్-'

'ఓరి కొండయ్యోవ్-ఓరి కొండయ్యోవ్-' కొండయ్యేంటే లగెత్తుండాడు శివయ్య గాబరా ఎమురొమ్ములకు తంతావుంటే.

'ఓబల్లకట్టాయినోవ్-ఓ ఎవురయ్యోవ్ లగెత్తేదీ-' అంటూ ఎనక గెట్టుమీన కేకలెగిసినై.

'ఓరి కొండయ్యోవ్-నన్ను సంపుతుండయిరా-లగెయి, లగెయి-' నరాలు సల్లొడుల్లుండయి శివయ్యకు.

'ఓ ఎవరయ్యోవ్-నిఁబడూ, నిలబడూ-' ఎనక లగెత్తుతుండారెవరో.

'సచ్చిన్నా చివయ్యన్నా-'

'లగెయి లగెయిరా-కొండయ్యా-వాయ్యో-' కాల్జారి, దిమ్మదిరిగి టొక్క

బోర్లా బూమ్మీన పడుతుండ కొండయమీనగా పట్టీ లేత్తా సుట్టసుట్టగా పడిపొయ్యాడు శివయ్య, దుమ్ము మెల్లెగుపుతా.

ఎనికిత్తే దబాదబా అంగలేసుకుంటా, ఎగశాస దిగశాస బుసలిడుత్తా వుంటే, రైనుబండికి మేకు దిగేసినట్టు పెడీల్మ నాగిపోయిం దాయిగ్రహం, బూమ్మీన సొపసుట్టగా పడుండ కొండయ్య శివయ్యల కెల్లి మెరుత్తుండ కల్లతో యింతగా సూత్తా.

'ఓ ఏవిఁయ్యోవ్? ఈ పిల్లలు బంగారం గానూ, యాడో దడుసుకుండ ట్టుండే—అరెరెరెరే, యీ కోటయ్య పిల్లల్నేవిఁటికి తోలాడబ్బా!... ఓ ఏవిఁయ్యోవ్—నూ చివయ్యవు గాదంటయ్యా? ఓయి మీ పిల్లోళ్ళు సల్లగుండా! యిదేందియ్యా అట లగెత్తుకొచ్చి పడిపొయ్యారూ?'

'నన్ను సంపమాకే తల్లా, నే నేం ఎరగనే—' అంటా లెగిసిన మద్దెలోనే ఒనికిపొయ్యాడు శివయ్య.

'ఈ పిల్లోణ్ణి దొంగల్దోలా! నే సాకలి గురవాయిని బాబూ—యీ యవార వేందంటా!'

'ఆఁ, అ య్యాట్టనే అంటయి లే—నూ ఎటుగా ఒచ్చా?'

'ఎహె తాలూ—పిల్లో డావజాన పడుంటే—అరెరెరెరే, దిమ్మర బొయ్యాడు పిల్లోడు కాత్తా—యిటు రావియ్యా నీ చివయ్య దొంగల్దోలా—యింకా నయం నే మీనా ఎంట పోకుండా యిటొచ్చా గాబట్టి—'

'కొండయ్యా—'

'సంపుతుండయిర చివయ్యనోవ్—'

* * *

ఆ దెబ్బదెబ్బా అయిదార్దినా ల్దాటి శివరేత్రి పొద్దుట కనంగా గానీ కొండయ కల్లు నికరపైఁన సూపుకు రాలా.

'అర అరా, తొయిరేందిరా పెబనూ—' గబాల్న తాడేసి లాగినట్టు మంచం మీన లేసి కూకుండాడు కొండయ్య బిత్తరబోతా.

'నే ఆదిలచ్చి—పానం దీశావుగదంట్రా కొండయ్యా! ఎన్ని పెబలొచ్చి నయిరా కోటయకొండకూ?' అనింది ఆదిలచ్చి, కొండయను యింతగాసూత్తా.

'యిదేందీ—చివయ్యన్నా?'

'చివయ్య కొండకెల్లాడుగా, కోటయమావఁకు కాత్తె కుశాలగుంటే!'

'ఆఁ, యీఁ—మాయ్యతో సెబతా నుండు—ఓ అమ్మోవ్!'

'యియ్యాల చివరేత్రి, యింకేం బోతాకొండకూ! మనూరి రతానికి సూస్తో

ఎట్టాటి రంగు రంగులగడ్డ లేశారో–'

'మొదు లా డెందు కెల్లాడు కొండకూ– ?'

'గొబ్బిరికాయ కొట్టిరమ్మని పంపీలా కోటయమావాఁ–నీబజన్నెక్క తెత్తి కెల్లాడ్రా చివయ్యా !'

'అఁ, యీఁ,–ఓ అమ్మోవ్–'

'యీరాయా శీకదే వుండార్రా కొఁదయ్యా ! తెల్లారక తలికే రంకుల్రాటాం ఎక్కి కూకుండార్రా !'

'ఆఁ !'

'ఓ చాయిబే, ఎలుగ్గొడ్డును తెత్తేనూ, సూరాయి దాని కెనకమాల కెల్లీ, పుల్లతో పొడిసేతలికీ–'

'అట సెప్పవేందే నా కొత్తకోకల బుల్లా–యీయ్యాల ఎట్టుండా వుంటది, పదవేందే ఎటో సూత్తావూ !'